సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



బైరాన్‌పల్లిలో కేరళ సీపీఎం..

బైరాన్‌పల్లిలోని బురుజును, అమరుల స్తూపాలను శనివారం కేరళ సీపీఎం బృందం సందర్శించింది. వివరాలు 8లో ▸



ప్రశాంత్‌నగర్: బతుకమ్మతో..

బతుకమ్మ సంబురాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట), సిద్దిపేటజోన్: ఊరూరా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. నాల్గో రోజైన శనివారం నానేబియ్యం బతుకమ్మగా పిలుస్తారు. ఈ సందర్భంగా నానేసిన బియ్యం, బెల్లం, చక్కెర, పాలతో నైవేద్యం సమర్పించారు. శనివారం రాత్రి టీఎన్జీఓ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.



ప్రశాంత్‌నగర్: హరిప్రియ నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో మహిళ



పూలబాట!

రైతు ఇంట సిరుల పంట

- సిద్దిపేట జిల్లాలో 260 ఎకరాలకు పైగా పూదోటలు
- బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు భలే డిమాండ్
- హైదరాబాద్, బెంగళూరు, ముంబై, తదితర పట్టణాలకు తరలింపు
- లాభాలు గడిస్తున్న రైతులు

సండే స్పెషల్

పండుగ ఏదైనా బంతి పూలు ఉండాల్సిందే. బతుకమ్మ, దసరా, సంక్రాంతి, ఉగాది పండుగలకు బంతి పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం రంగుల వర్ణాలతో కనువిందు చేసే బంతి తోటలు కంటికి ఇంపునిస్తున్నాయి. నీటి వసతి కలిగిన చోట యేడాది పొడవునా విరబూసే బంతి పూల సాగుతో రైతులు మంచి ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. బతుకమ్మ, నవరాత్రుల పూజలకు పూల అవసరం అధికంగా ఉండటంతో వాటి కొనుగోళ్లు బాగా పెరిగాయి. మార్కెట్లో విరివిగా లభిస్తున్న బంతిపూల సాగుపై 'సాక్షి' ప్రత్యేక కథనం. 8లో

గన్నె తిరుపతిరెడ్డి, దుబ్బాక
వేముల బాల్‌రాజ్, మిరుదొడ్డి :



న్యూస్‌రీల్

కళాశాలలకు దసరా సెలవులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఈ నెల 6 నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డి శనివారం తెలిపారు. సెలవు దినాల్లో కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు సెక్రటరీ ఆదేశానుసారం అన్ని కళాశాలలు ఈ సెలవులను తప్పకుండా పాటించాలని సూచించారు. లేకుంటే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాలను తిరిగి ఈనెల 14న పున: ప్రారంభమవుతాయని తెలిపారు.

లలితాపరమేశ్వరిగా..



లలితాపరమేశ్వరిదేవిగా అమ్మవారు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నా యి. మూడో రోజై న శనివారం లలితాపరమేశ్వరిదేవిగా శ్రీవిద్యాసరస్వతి మాత దర్శనమిచ్చారు. వేద పండితులు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలు, పూలమాలికలతో శ్రీలలితాదేవిగా అలంకరించారు. చతుష్షష్ఠ్యుపచార పూజలు, సప్తశతి పారాయణాది పూజలు, హవనం నిర్వహించారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి.

పీపీల నియామకం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా కోర్టుకు నూతన ప్రభుత్వ ప్లీడర్లను నియమిస్తూ న్యాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సిద్దిపేట జిల్లా సెషన్స్ కోర్టు, ఫస్ట్ క్లాస్ సెషన్స్ జడ్జి కోర్టులకు హరిహరరావు, జూనియర్ సివిల్ కోర్టుకు రఫీయుద్దీన్ నియామకం అయ్యారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో ఇద్దరు న్యాయవాదులను శనివారం సన్మానించారు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే



మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రాంసాగర్‌లో నీల భిక్షపతి అధ్యక్షతన శనివారం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కేవలం 40 శాతం రైతులకు మాత్రమే అమలు చేసిందన్నారు. మిగతా రైతులకు కూడా వెంటనే రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు పేద్దపీట వేస్తూ పేద ప్రజలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గోపాల స్వామి, శశిధర్, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి ప్రణాళిక

- విత్తన సబ్సిడీ ఊసేలేదు
- నిరాశలో రైతులు


యాసంగి సాగు ప్రణాళిక సిద్ధమైంది. వానాకాలంలో తొలుత అనావృష్టి ఆ తర్వాత అతివృష్టి వంటి భిన్నమైన పరిస్థితులతో పంట నష్టానికి రైతులు గురయ్యారు. యాసంగిపై గంపెడాశలతో ముందుకు సాగుతున్నారు. ఈ సీజన్‌లోనూ విత్తన సబ్సిడీ ఊసే లేకపోవడం నిరాశపరుస్తున్నది.

గజ్వేల్: యాసంగి సీజన్‌కు సంబంధించి గతేడాది 3.86 లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఈసారి కూడా అంతే విస్తీర్ణంలో చేపట్ట వచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో అత్యధికంగా వరి 3 లక్షల ఎకరాలకు పైగా ఇతర పంటలు మరో 50–80 వేల ఎకరాలకు పైగా సాగులోకి రావచ్చని భావిస్తున్నారు. ఈసారి గతానికి భిన్నంగా శనగ పంట భారీగా సాగులోకి వచ్చే అవకాశం కనిపిస్తున్నది. సాధారణంగా మొక్కజొన్న కోత తర్వాత ఆ స్థానంలో అక్టోబర్ రెండో వారం నుంచి శనగలు విత్తుతారు. జిల్లాలో సుమారుగా 20వేల ఎకరాల వరకు శనగ పంట సాగులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం 20వేల క్వింటాళ్లకుపైగా సబ్సిడీ విత్తనాలు అవసరముంటాయి. కానీ ఈ విత్తుకు సబ్సిడీ లేకపోవడం రైతులను కలవరపరుస్తున్నది. ఇదిలా ఉండగా నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్న గజ్వేల్‌తో పాటు దుబ్బాక డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ పంటను భారీ ఎత్తున సాగు చేస్తారు. ఈసారి వ్యవసాయశాఖ అంచనాకు మించి శనగ పంట సాగులోకి వచ్చే అవకాశం కనిపిస్తున్నది.

ఇతర పంటలది అదే పరిస్థితి

మొక్కజొన్న 30 వేల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉండగా 4 వేల క్వింటాళ్ల విత్తనం అవసరం ఉండనుంది. పొద్దు తిరుగుడు 7 వేలపై చిలుకుకు.. 1,100 క్వింటాళ్ల విత్తనం, వేరుశనగ 4 వేల ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశం ఉండగా 600 క్వింటాళ్ల విత్తనం అవసరముంటుంది. కానీ సబ్సిడీ లేక రైతులపై భారం పడనుంది. తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థ ఆధ్వర్యంలో ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీతో ప్రమేయం లేకుండా పూర్తి ధరపై విత్తనాలు అందుబాటులో ఉంచారు. ఇందులో భాగంగా శనగలు జేజీ–11 రకం విత్తనాలు కిలోకు రూ.90 చొప్పున 25 కిలోల బ్యాగును రూ.2,250కు విక్రయిస్తున్నారు. దీనిపై రూ.400 అదనంగా సర్వీస్ చార్జి విధిస్తున్నారు. వేరుశనగ కే–6రకం కిలోకు రూ.101.55 చొప్పున 30 కిలోల బ్యాగును రూ.3046.50కు అమ్ముతున్నారు. ఇందుకు సర్వీస్ చార్జి రూ.200 విధిస్తున్నారు. గిర్నర్ రకం కిలోకు 104.55కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా కుసుమ కిలోకు రూ.82.82 నుంచి 85.82కు విక్రయిస్తున్నారు. నువ్వులు కిలోకు రూ.196.30కు అమ్ముతున్నారు. ఇకపోతే వరి, మొక్కజొన్న విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో పూర్తి ధరపై ఎన్నో రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

> **సర్వం సిద్ధం**
>
> జిల్లాలో యాసంగి సాగుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే శనగ, పొద్దుతిరుగుడు ఇతర విత్తనాలు కావాల్సినవి సిద్ధంగా ఉంచాం. గతేడాది మాదిరిగానే ఈసారి వరి అత్యధికంగా సాగులోకి వచ్చే అవకాశం ఉంది.
>
> – రాధిక, జిల్లా వ్యవసాయాధికారి



కారుణ్య నియామకాల కోసం..

ఆర్డీఓకు వీఆర్‌ఏల వారసులు వినతి

గజ్వేల్‌రూరల్: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్‌ఏ) వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శనివారం గజ్వేల్‌లో ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసులు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వారి విద్యార్హతలను బట్టి వివిధ శాఖలకు కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను జారీ చేసిందని గుర్తు చేశారు. అయితే వీరి వారసుల నియామకాలు జరపకపోవడంతో దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది వీఆర్‌ఏలు ఉన్నారని, గత ప్రభుత్వం 81, 85 జీఓ జారీ చేసి 16,758 మందిని వివిధ శాఖలకు కేటాయించిందని అన్నారు. 3,797 మందికి ఎలాంటి నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో సుమారు 265 మంది వరకు మృతిచెందారని తెలిపారు. వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం గత ప్రభుత్వం జీఓ 81, 85లను జారీ చేస్తే స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో హైకోర్టులో స్టేను ఎత్తివేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసులు నీరుడి నర్సింహులు, చంద్రం, శ్రీనివాస్, నర్సింహులు, భిక్షపతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

శభాష్ రాము

వర్గల్ యువకుడికి
రెండు ప్రభుత్వ ఉద్యోగాలు



రాము

వర్గల్(గజ్వేల్): ఓ యువకుడు రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరితో ప్రశంసలు అందుకుంటున్నాడు. అతనే వర్గల్‌కు చెందిన దేవి రాము. 2014లో బీఈడీ పూర్తి చేసి, 2015లో ప్రత్యేక అవసరాల పిల్లల విద్యాబోధనకు సంబంధించిన స్పెషల్ బీఈడీని సైతం పూర్తి చేశాడు. 2017లో డీఎస్సీ రాస్తే ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం చేజారింది. 2024 జనవరిలో మరోసారి డీఎస్సీ నోటిఫికేషన్ రాగా అహర్నిశలు శ్రమించాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఏకంగా రెండు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ (సోషల్), స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులకు ఎంపికయ్యాడు.



వర్షంతో రోడ్డు పై నిలిచిన వరద నీరు

భారీ వర్షం.. రోడ్లు జలమయం

సిద్దిపేటజోన్: పట్టణంలో కురిసిన భారీ వర్షంతో శనివారం మెదక్ రహదారిపై నీరు నిలిచింది. పలు అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. స్థానిక విక్టరీ టాకీస్ చౌరస్తా, పాత బస్టాండ్ చౌరస్తాలో లోతట్టు ప్రదేశాల్లో పెద్ద ఎత్తున వరద నిలిచిపోయింది. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.

పక్కాగా ఎఫ్‌డీసీ సర్వే

సీఎంఓ జాయింట్ సెక్రటరీ
సంగీత సత్యనారాయణ

గజ్వేల్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు(ఎఫ్‌డీసీ) సర్వే పక్కాగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కార్యాలయ జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ సూచించారు. శనివారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఎఫ్‌డీసీ సర్వే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమానికి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పైలెట్‌గా చేపడుతున్నట్లు వెల్లడించారు. సర్వే సందర్భంగా కుటుంబాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఈ సర్వే అక్టోబర్ 8 వరకు కొనసాగనుందని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో 80 శాతం సర్వే పూర్తయ్యిందని, మిగతాది పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్‌డీఓ బన్సీలాల్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ మనుచౌదరితో కలిసి సర్వేను పరిశీలిస్తున్న సత్యనారాయణ

సమగ్ర వివరాలు తప్పనిసరి

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ
ప్రత్యేక కార్యదర్శి హరిచందన

సిద్దిపేటకమాన్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం అధికారులు సిద్ధం చేస్తున్న జాబితా ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఉండాలని, కుటుంబ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరి చందన దాసరి అన్నారు. పట్టణంలోని 34వ వార్డులో జరుగుతున్న సర్వేను కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు ఎన్నో విధాలుగా లబ్ధి చేకూర్చే డిజిటల్ కార్డుల తయారీకి ఎలాంటి తప్పులు లేకుండా జాబితా తయారు చేయాలని సూచించారు. సర్వే అత్యంత పారదర్శకతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట 34వ వార్డులో అధికారులతో మాట్లాడుతున్న హరిచందన

వన్యప్రాణుల సంరక్షణకు కృషి

గజ్వేల్ ఎఫ్‌ఆర్‌ఓ వినాయక్

గజ్వేల్‌రూరల్: అంతరించిపోతున్న వన్యప్రాణుల సంరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి(ఎఫ్‌ఆర్‌ఓ) వినాయక్ పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం గజ్వేల్‌లోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అడవి జంతువులు, వాటి నివాసాలను గుర్తించి వాటి సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, అటవీ శాఖ అధికారులు పవన్‌కుమార్, బాలేశం, అర్జున్, సిబ్బంది కిషోర్, ప్రవీణ్, రాజు, స్వామి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థతోనే విలువలు

- ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ శ్రీధర్‌జీ
- పట్టణంలో భారీ ర్యాలీ

గజ్వేల్‌రూరల్: భారతదేశం అగ్రరాజ్యంగా ఆవిర్భవించేందుకు అందరూ సంఘటితం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ శ్రీధర్‌జీ పిలుపునిచ్చారు. సంఘం ఏర్పాటై 100 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం పేరిట శనివారం గజ్వేల్‌లో ఉన్న ప్రధాన వీధుల్లో స్వయం సేవకులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐఓసీ పక్కనగల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ్ మల్యాల ప్రవీణ్‌జీ, డాక్టర్ శివకుమార్‌లతో కలిసి శ్రీధర్‌జీ మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్నందున ఈ విజయదశమితో పాటు వచ్చే రెండు దసరా పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థతోనే భవిష్యత్ తరాలు బాగుంటాయని, మంచి విలువలు అలవడుతాయన్నారు.



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


వికాస్‌గౌడ్

మద్దూరు(హుస్నాబాద్): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు గ్రామానికి చెందిన వికాస్ గౌడ్ ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ శనివారం తెలిపారు. హన్మకొండ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, హైద్రాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశ్, సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బొడిగం శ్రీనివాస్ గౌడ్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు ఇంతియాజ్, మనోహర్, నర్సింహులు, బాలరాజు, పీడీ దామెర ప్రేమ్ కుమార్, సీనియర్ క్రీడాకారులు శ్రీకాంత్, ప్రభాకర్, గౌరీ, శేఖర్, సిద్దిక్, తదితరులు వికాస్‌గౌడ్‌ను అభినందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు..


శ్రీవిక, ఫైజున్నీస

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్.శ్రీవిక (ట్రయాత్లిన్), ఫైజున్నీస (లాంగ్‌జంప్) రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం మహమూద్ తెలిపారు. ఈ నెల 7,8 తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న పోటీలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చేప పిల్లల పంపిణీ ఎప్పుడు?

మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు

గజ్వేల్: చేప పిల్లల పంపిణీపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ చేప పిల్లల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. ఏటా కోట్లాది రూపాయల వ్యయంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదిలే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి మత్స్యకారుల ఉపాధికి బాటలు వేశారని తెలిపారు. నేడు పరిస్థితి భిన్నంగా తయారైందని ఆరోపించారు. ముదిరాజుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ఇదే కాకుండా అన్ని రంగాల్లో సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యాన్ని చాటుకున్నారని మండిపడ్డారు.

కలప పట్టివేత

పెద్దశంకరంపేట(మెదక్): మండల అటవీరేంజ్ పరిధిలోని టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ వికాస్ శనివారం తెలిపారు. పట్టాభూముల్లో అనుమతులు లేకుండా నరికిన చింత, తుమ్మ, వేప మొద్దులను కుసంగి గ్రామం నుంచి ఇతర గ్రామానికి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని నారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ మారుతి Desire కార్ నడుపుటకు అనుభవం గల కార్ డ్రైవర్ కావలెను. అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేట్ ఏరియాల వారు సంప్రదించండి: 9985249352 [HA-14725]

■ ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్దులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [M-1185464]

■ ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు హెల్త్ అడ్వైజర్లు కావలెను. అర్హత : SSC ఆపైన. నోట్ : LIC ఏజెంట్స్ & జనరల్ వెహికిల్ ఇన్సూరెన్స్ & మోటార్ వెహికిల్స్ ఇన్సూరెన్స్ చేసేవారికి ఎగ్జామ్ లేకుండానే కోడ్ ఇవ్వబడును. ఫోన్ : 9849938003 [H-1177733]

■ Walkin interview for ELECTRICIAN & MECHANIC Contact : 7989896938/ 9542341512 [HA-4880]

FACULTY TEACHERS

■ Wanted Qualified and Experienced Teachers to teach Mathematics, Physical Science, English for High School and IIT Foundation Mathes, Physics, Chemistry Teachers, PETs, at St Mary's Vidyaniketan High School, Pragnapur- Gajwel, Siddipet (Dist) WhatsApp your resume 9348669798. Attend Demo Interview with certificates on monday, 7th october 2024 9.00am to 3.00 pm. [HA-14722]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పూలబాట!

రైతు ఇంట సిరుల పంట



ఈ బంతిపూల తోటలో కనిపిస్తున్న రైతు పేరు బండారి రమేశ్ గౌడ్. తొగుట మండలం వెంకట్రావు పేటకు చెందిన ఈయన తనకున్న ఎకరం పొలంలో కొద్దిపాటి నీటి వనరులతో బంతి పూలను సాగు చేస్తున్నాడు. దుక్కి దున్నింది మొదలు మొక్కలు నాటి, కలుపు తీయడానికి కూలీల ఖర్చుతోపాటు, సస్యరక్షణ చర్యలకు సుమారు రూ. 45 వేలు పెట్టుబడి అవుతుంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ దసరా, దీపావళి పండుగ సమయంలో ఈ సాగు చేస్తున్నాడు. సీజన్‌లో సుమారు 3 టన్నుల వరకు పూలు కోతకు సిద్ధమయ్యాయి. వీటిని తానే స్వయంగా మార్కెటింగ్ చేస్తున్నాడు. పెట్టుబడులు, రవాణా చార్జీలు మొత్తం కలిపి రూ.70 వేలు పోను సీజన్‌లోనే సుమారు రూ.1.50 లక్షల ఆదాయం లభిస్తుంది.

– బండారి రమేశ్‌గౌడ్, వెంకట్రావుపేట



దుబ్బాక/మిరుదొడ్డి: సిద్దిపేట జిల్లా ప్రధానంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో రైతులు ప్రధానంగా కూరగాయలు, పూల తోటలతోపాటు కమర్షియల్ పంటలు పండిస్తుంటారు. ఇందులో ప్రధానంగా బంతిపూలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 260కి పైగా ఎకరాల్లో బంతిపూల తోటలు వేశారు. 200 మందికి పైగా రైతులు బంతిపూల తోటలు సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. కొద్ది విస్తీర్ణంలో మాత్రమే జాస్మిన్, మల్లె తోటలు సాగు చేశారు. ప్రధానంగా జిల్లాలోని దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట మండలం వెంకట్రావుపేట, తొగుట, కాన్గల్, వర్దరాజుపల్లి, మిరుదొడ్డి మండలం అందె, అల్వాల, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలతో పాటు గజ్వేల్ మండలంలోని కొల్గూర్, శేరిపల్లి, జగదేవ్‌పూర్, వర్గల్, మర్కూక్, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో రైతులు బంతిపూల తోటలు సాగు చేశారు. అనుకున్నంత స్థాయిలో పూల ఉత్పత్తి లేని కారణంగా మార్కెట్లో బంతి పూలకు భారీ డిమాండ్ ఏర్పడనుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎకరం తోటలో 12 టన్నుల దాకా..

పూల తోటలు సాగు చేస్తు రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలో చాలా మంది రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తూ వస్తున్నారు. ఎకరం బంతిపూల తోట పెట్టడానికి విత్తనాలు అన్ని ఖర్చులు కలిపి రూ.40 నుంచి 50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరం తోటలో 10 నుంచి 12 టన్నుల వరకు బంతి పూలు పండుతాయి. అంటే ప్రస్తుతం మార్కెట్‌లో బంతిపూల రేట్ రీటైల్‌గా అయితే కిలోకి రూ.120 నుంచి రూ.150 వరకు ఉండగా హోల్‌సెల్‌లో రూ.75 నుంచి రూ.90 వరకు డిమాండ్‌ను బట్టి రోజు అమ్ముతున్నారు. ఎకరం బంతిపూల తోట ద్వారా రైతులకు అన్ని ఖర్చులు పోను రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు..

జిల్లా నుంచి ప్రధానంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్, సిరిసిల్ల, సూర్యాపేట, నల్గొండతోపాటు ముంబాయి, బెంగళూరు తదితర పట్టణాలకు బంతిపూలు తీసుకెళ్తుంటారు. ఎకరాల విస్తీర్ణంలో పూల తోటలు సాగు చేయడంతో హైదరాబాద్, బెంగళూర్, ముంబాయి, సూర్యాపేట, వరంగల్, కరీంనగర్‌ల నుంచి పెద్ద వ్యాపారులు తోటల వద్దకే ఫోన్లు చేసి వాహనాల్లో వస్తూ హోల్‌సెల్‌గా కొనుగోలు చేసుకొని తీసుకెళ్తారు.


తొగుట మండలం వెంకట్రావుపేటలో ఓ రైతు సాగు చేసిన బంతిపూల తోట

బతుకమ్మ, దసరాకు భలే డిమాండ్

తెలంగాణలో పూల పండుగగా చెప్పుకునే బతుకమ్మకు పూలకు ఉండే డిమాండ్ అంతా ఇంత కాదు. మార్కెట్లో ఎక్కడ చూసిన పలు రకాల బంతిపూలే దర్శనమిస్తున్నాయి. గునుగు పువ్వుతోపాటు బంతిపూలే ప్రధానం. అలాగే దుర్గామాతలను పెద్ద ఎత్తున ప్రతిష్ఠించడంతో పూల అవసరం ఎక్కువగానే ఉంటుంది. దసరా రోజు వాహనాలకు పూజలు చేసేందుకు దండలుగా ఉపయోగిస్తారు. దీపావళికి వ్రతాలకు బంతి పూలనే వాడుతారు.

పంటల సస్యరక్షణ చర్యల్లోనూ..

ఆహార పంటల సాగులో ఎదురయ్యే చీడ పీడల నివారణకు బంతి మొక్కలు ఎంతో దోహదం చేస్తాయి. పప్పు ధాన్యాలు, మక్క, పసుపు, ఉల్లి, పత్తి, ఆకు కూరల వంటి పంటల్లో గట్ల వెంట బంతి మొక్కలను నాటుతారు. ఇది పంటలకు సోకే చీడ పీడలను నివారిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటి పెరటి పరిసరాల్లో బంతి పూల మొక్కలను పెంచడం వల్ల పూల వాసనకు ఇళ్లల్లోకి దోమలు ధరిచేరవని చెప్పుకొచ్చారు.


కనువిందు చేస్తున్న బంతిపూల తోట

తోటనే మాకు జీవనాధారం



బంతిపూల తోటనే మా కుటుంబానికి ప్రధానం. ప్రతీయేటా బంతిపూల తోటను సాగు చేస్తూ మేము ఆర్థికంగా పైకి వస్తున్నాం. ఇప్పుడు 30 గుంటలు (ముప్పావు ఎకరం) బంతి పూల తోట సాగు చేశాం. ఈసారి పండుగలకు క్రాప్ బాగానే వచ్చింది. ధర కూడా బాగానే ఉంది. పూల తోటలను నమ్ముకుంటే బాగానే ఉంటది.

-ఓలపు లక్ష్మి, వెంకట్రావుపేట

బంతి పూలకు ప్రత్యేక స్థానం



ప్రతీ పండుగ వేడుకల్లో బంతి పూలనే వినియోగిస్తాం. మార్కెట్లో తక్కువ ధరకే లభించే బంతి పూలతో అల్లికలు కూడా చేస్తాం. ముఖ్యంగా బతుకమ్మలను పేర్చడానికి బంతిపూలనే ఎక్కువగా వాడుతాం. ఈ పూలతో పేర్చిన బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో పూజించి వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడి పాడి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేస్తాం. శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలల్లో కూడా అమ్మవారికి బంతి పూలతోనే అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకుంటాం.

- ప్రియాంక, మిరుదొడ్డి

ప్రోత్సహించేందుకు కృషి



జిల్లాలో పూల తోటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. పూల తోటలు ప్రధానంగా బంతిసాగుతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. జిల్లాలో ప్రతీయేటా క్రమంగా పూల తోటల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం జిల్లాలో 260 ఎకరాల్లో బంతిపూల తోటలను 190 మంది రైతులు సాగు చేశారు.

- రమేశ్, డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి

రెండు నెలల్లో పూలు కోతకు



నీటి వనరులు ఉంటే చాలు యేడాది పొడవునా బంతి సాగు చేయొచ్చు. బంతి పూలల్లో ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ అను రకాలు ఉన్నాయి. వీటినే ముద్ద బంతి, రిక్క బంతులుగా పిలుస్తుంటారు. ఇవి ఎక్కువగా పసుపు, ఎరుపు వర్ణాల్లో లభిస్తుంటాయి. వీటి సాగుకు తక్కువ స్థలం, తక్కువ ఖర్చు, పెద్దగా పెట్టుబడి లేకుండానే కాస్త శ్రమకోర్చి సాగు చేయొచ్చు. మొక్కలు నాటిన నుంచి రెండు నెలల్లో పూలు కోతకు వస్తాయి. కోతకు వచ్చిన పూలను ఉదయం గానీ, సాయంత్రం మాత్రమే కోయాలి. సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే బంతిలో మంచి దిగుబడులు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయి.

- డా. పల్లవి, వ్యవసాయ శాస్త్రవేత్త తోర్నాల


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

వీఆర్‌ఏల వారసులకు న్యాయం చేయండి

అదనపు కలెక్టర్‌కు వినతి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ జీఓ ప్రకారం వీఆర్‌ఏల వారసుల నియామకం చేపట్టి ఆదుకోవాలని బాధితులు శనివారం మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ జీఓ 81,85 పై కోర్టు స్టే తొలగించినప్పటికీ 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో మా బతుకులు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. 61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులు జిల్లాలో ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే 17 మంది వీఆర్‌ఏలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ప్రకారం జిల్లాలో మొత్తం 20,555 మంది వీఆర్‌ఏల్లో 16,758 మంది వివిధ డిపార్ట్‌మెంట్లలో వారి అర్హతలను బట్టి నియామక ఉత్తర్వులు, ఐడీలు కూడా ఇచ్చారన్నారు. వీఆర్‌ఏల వారసులు 3,797 మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఆయా మండలాల నాయకులు నాగరాజు, భూపాల్, శివకుమార్, నాగరాజు, వీరేశం, కిష్టయ్య, శ్రీశైలం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- భర్త ఆత్మహత్య

తూప్రాన్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకటాయిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన కిష్టారం ఎల్లేశ్(36)కి 13 ఏళ్ల కిందట మెదక్‌కు చెందిన యాదమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడాదిన్నర కిందట దంపతుల మధ్య గొడవలు జరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా కాపురానికి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఎల్లేశ్ 4న తూప్రాన్ పట్టణ శివారులో రామాలయం సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైరాన్‌పల్లిలో కేరళ సీపీఎం బృందం


బురుజు వద్ద నాయకుల బృందం

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ సాయుధ పోరాటానికి పునాది వేసిన బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజును, అమరవీరుల స్థూపాలను శనివారం కేరళ రాష్ట్ర సీపీఎం నాయకుల బృందం సందర్శించారు. బురుజు వద్ద అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడి బైరాన్‌పల్లి చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్ర పుట్టల్లో లిఖించదగిందన్నారు. రజాకార్లను, భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ప్రాంతానికి ఉందన్నారు. సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీంచే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్, పాలకుర్తి మండల కార్యదర్శి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రప్ప(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆవును కట్టివేసి వస్తానని వెళ్లాడు. బసవేశ్వర మందిరం వద్ద మురికి కాల్వలో చెత్త నిండిపోయి నీరు పోవడం లేదని గమనించాడు. చెత్తను తీసివేస్తూ పక్కనే సిరియల్ లైట్లు వేసే డెకరేషన్ పచ్చి కట్టెను పట్టుకున్నాడు. వెంటనే కరెంట్ షాక్ కొట్టి మురికి కాల్వలో పడ్డాడు. ఇది గమనించిన భార్య చికిత్స నిమిత్తం చంద్రప్పను సమీపంలోని బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి..

- ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- తొగుట మండలం వెంకట్రావుపేట శివారులో ఘటన
- పెళ్లింట తీవ్ర విషాదం


మహ్మద్ ఖాసీం (ఫైల్)

దుబ్బాకటౌన్ /తొగుట(దుబ్బాక): ఆ పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. మరికొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి ఉండగా ఇంతలోనే తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన తొగుట మండలం వెంకట్రావుపేట శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయపోల్ మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసీం వీఆర్‌ఏగా విధులు నిర్వహించేవాడు. శనివారం చిన్న కుమారుడు నిజాముద్దీన్ పెళ్లి ఉండగా పనుల నిమిత్తం మరో కుమారుడు వసియొద్దీన్, భార్య సాహెరాతో కలిసి ఖాసీం కారులో గజ్వేల్‌కు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున తిరిగొస్తున్న క్రమంలో తొగుట మండలం వెంకట్రావు పేట శివారులోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఖాసీం అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సాహెరా, కుమారుడు వసీంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. ఖాసీం మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కొన్ని గంటల్లో కుమారుడి పెళ్లి ఉండగా ఇంతలో తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబలించడం బాధాకరమన్నారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. శుక్రవారం కాట్రియాలలో ముత్తవ్వ అనే మహిళను మంత్రాల నెపంతో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు శనివారం గ్రామంలో పర్యటించారు. బాధిత మహిళ ఇంటిని సందర్శించి ఇరుగు, పొరుగు వారితో మాట్లాడారు. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాట్రియాల గ్రామస్తులు మూఢ నమ్మకాల ఊబిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరికి జ్వరాలు వచ్చినా మంత్రాలేమోనని భయాందోళన చెందుతున్నారని అన్నారు. మూఢ నమ్మకాలను రూపు మాపాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పద్మ, నగేశ్, మీన, తదితరులు ఉన్నారు.

మహిళ హత్య కేసులో ఆరుగురు అరెస్ట్


నిందితులను చూపుతున్న సీఐ వెంకట్‌రాజ్‌గౌడ్

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన మహిళ హత్య కేసులో శనివారం రాత్రి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన డ్యాగల ముత్తవ్వ (50) కొంతకాలంగా బాణామతి చేస్తుందనే అనుమానంతో ఆరుగురు ఆమె ఇంటి వద్దకు వెళ్లి కర్రలతో దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు డ్యాగల మురళీ తన తండ్రిని గతంలో ముత్తవ్వ మంత్రాలు చేసి చంపిందనే అనుమానంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు.ఈ కేసులో మురళీతోపాటు రామస్వామి, శేఖర్, రాజలత, లక్ష్మి, పోచవ్వను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు నిందితులకు సహకరించినట్లు తెలిసిందని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ పేర్కొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

- ఆరుగురు కూలీలకు గాయాలు
- కర్ణాటక సరిహద్దులో ప్రమాదం


నారాయణఖేడ్: ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

నారాయణఖేడ్: ఆటోను ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కర్ణాటక- తెలంగాణ సరిహద్దు సమీపంలో చోటు చేసుకుంది. ఖేడ్ మండలం పీర్ల తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్ల తండాకు చెందిన 18 మంది కూలీలు శుక్రవారం ఉదయం సోయాపంట కోతల కోసం పొరుగునే ఉన్న కర్ణాటకలోని చిక్లీ గ్రామానికి ఆటోలో వెళ్లారు. రాత్రి తిరుగొస్తుండగా కర్ణాటక- తెలంగాణ సరిహద్దు సమీపంలో ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పారిబాయి, సర్దార్, సోనిబాయి, చందు నాయక్, ప్రకాశ్, నందినీలకు తీవ్రగాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ప్రకాశ్, నందినీల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


గూనయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్): బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పొలంపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి కథనం మేరకు.. వెల్దుర్తి మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన గంపల గూనయ్య (26)కు చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన మున్నితో ఆరు నెలల కిందట వివాహం జరుగగా ఇల్లరికం అల్లుడిగా అక్కడే ఉంటున్నాడు. చిన్న శంకరంపేట మండలం చందంపేటలోని ఓ ప్రవేట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం పరిశ్రమకు వెళ్లిన అతడు సాయంత్రం విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికొస్తుండగా అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. ఏపీలోని కర్నూల్ బలపాలపల్లి గ్రామానికి చెందిన నాగయ్య (43) అడ్డా కూలీగా పని చేస్తున్నాడు. ఆర్మూర్‌లో పాత సామగ్రి లోడ్ చేసేందుకు శుక్రవారం తోటి కూలీలతో వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో కూలీలంతా వాహనంలో హైదరాబాద్ వైపు వస్తున్నారు. శనివారం తెల్లవారుజామున చేగుంట శివారులోని ఊర చెరువు సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగయ్య మృతి చెందగా, మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరు


దుర్గయ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిన్నారం మండల కేంద్రానికి చెందిన కురబోయిన దుర్గయ్య(56) గుమ్మడిదల మండలంలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బైక్‌పై విధులకు బయలుదేరాడు. కొద్దిసేపటికి అన్నారం గ్రామ శివారులోకి రాగానే జంగంపేట గ్రామానికి చెందిన సాయికుమార్ అనే యువకుడు బైక్ పై అతివేగంతో వచ్చి దుర్గయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దుర్గయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యం సేవించిన వ్యక్తి..

మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పటాన్ చెరు మండలం ఇస్నాపూరకు చెందిన శ్రీనివాస్(40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇస్నాపూర్‌లోని ఓ వైన్స్‌లో మద్యం తాగి పర్మిట్ గదిలో పడిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.